సాక్షి
మంచిర్యాల
మంగళవారం । 12 । సెప్టెంబర్ । 2023



అంగన్‌వాడీ టీచర్ల సమ్మె

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీ టీచర్లు నిరవధిక సమ్మె చేపట్టారు. జిల్లాలోని పలు మండలాల్లో విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. 9లో▸

ఐసెట్ కౌన్సెలింగ్ ప్రశాంతం

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో ఐసెట్ కౌన్సెలింగ్ ప్రక్రియ సోమవారం రెండో రోజు ప్రశాంతంగా సాగింది. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని హెల్ప్‌లైన్ కేంద్రంలో విద్యార్థులకు కౌన్సెలింగ్ చేశారు. 240 మంది ధ్రువీకరణ పత్రాలను అధికారులు పరిశీలించారు. విద్యార్థుల వివరాలను ఎన్‌రోల్ చేసుకుని, ఎంబీఏ, ఎంసీఏ కళాశాలల వివరాలను విద్యార్థులకు వెల్లడించారు.

గరిష్ఠం/కనిష్ఠం
32.0 /26.0

వాతావరణం

మధ్యాహ్నం తర్వాత ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. పడమర దిశగా ఈదురుగాలులు బలంగా వీస్తాయి.

న్యూస్‌రీల్

సమైక్యత దినోత్సవానికి అతిథులు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: సెప్టెంబర్ 17న 'తెలంగాణ జాతీయ సమైక్యత దినోత్సవం'కు జిల్లా కేంద్రాల్లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, గౌరవ వందనం స్వీకరించేందుకు రాష్ట్రం ప్రభుత్వం తరఫున అతిథులను ఖరారు చేసింది. నిర్మల్‌కు మంత్రి ఏ.ఇంద్రకరణ్‌రెడ్డి, ఆదిలాబాద్ జిల్లాకు ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, కుమురంభీం జిల్లాకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ, సుంకరి రాజు, మంచిర్యాలకు ప్రభుత్వ విప్ బాల్క సుమన్‌ను కేటాయించింది. ఆ రోజు ఉదయం 9గంటలకు జిల్లా కేంద్రాల్లో జాతీయ పతాకాన్ని ఎగరవేయనున్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్లు ఏర్పాట్లు చేయాలని సీఎస్ శాంతికుమారి ఆదేశాలు ఇచ్చారు.

చవితి ఉత్సవాలు శాంతియుతంగా జరుపుకోవాలి

- రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి
- కమిషనరేట్‌లో శాంతికమిటీ సమావేశం



మాట్లాడుతున్న సీపీ రెమా రాజేశ్వరి

మంచిర్యాలక్రైం: వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి అన్నారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ హెడ్ క్వార్టర్‌లో సోమవారం మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల పోలీస్ అధికారులు, వివిధ మత గురువులు, కమిటీ పెద్దలతో శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ గణేష్ చతుర్థి, మిలాద్-ఉల్-నబీ ఉన్నందున సామరస్యంగా జరుపుకోవాలని తెలిపారు. వినాయక ప్రతిమలు ఏర్పాటు చేసేవారు స్థానిక పోలీస్‌స్టేషన్లలో 15లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మండపాల వద్ద సీసీ కెమెరాలు, బాధ్యత గల కమిటీ నిర్వాహకులు నిరంతరం ఉండాలని సూచించారు. పోలీసులు సూచించిన నిబంధనలు కచ్చితంగా పాటించాలని అన్నారు. శోభాయాత్ర సమయంలో పోలీసు శాఖ రూట్ మ్యాప్‌ను అనుసరించాలని అన్నారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే వార్తలు ప్రచారం చేసిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పెద్దపెల్లి డీసీపీ వైభవ్ గైక్వాడ్, మంచిర్యాల డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్, ఏసీపీ తిరుపతి రెడ్డి, ఎడ్ల మహేష్, వివిధ మతాల పెద్దలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అమరుల త్యాగాలు వెలకట్టలేనివి



అమరుల కుటుంబాలకు సన్మానం

మంచిర్యాలక్రైం: అటవీ సంరక్షణలో అమరులైన వారి త్యాగాలు వెల కట్టలేనివని మంచిర్యాల సబ్ డివిజన్ ఎఫ్‌డీవో వినయ్‌కుమార్ సాహు అన్నారు. జాతీయ అటవీ శాఖ అమర వీరుల సంస్మరణ దినోత్సవం సోమవారం జిల్లా అటవీ శాఖ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అమరవీరుల కుటుంబాలను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తింపు పోరుకు సై!

- సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘ ఎన్నికలకు రెడీ
- ఈ నెల 22న షెడ్యూల్, వచ్చే నెల 28న పోలింగ్
- కార్మిక క్షేత్రంలో మొదలైన ఎన్నికల హడావుడి



బొగ్గు గని కార్మికులు(ఫైల్)

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: బొగ్గు గనుల్లో గుర్తింపు సమరం మొదలైంది. దాదాపు నాలుగేళ్లుగా సింగరేణి కార్మికుల గుర్తింపు సంఘం ఎన్నికల నిర్వహణలో జాప్యం జరుగుతోంది. తాజాగా హైదరాబాద్‌లో కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్, సింగరేణి సంస్థ, 15కార్మిక సంఘాలతో ఎన్నికల నిర్వహణపై జరిగిన సమావేశంలో ఈ నెల 22న షెడ్యూల్ విడుదల, వచ్చే నెల 28న పోలింగ్ నిర్వహణకు నిర్ణయం తీసుకున్నారు. ఈ నెల 21న కార్మికులకు ఏరియర్స్ చెల్లింపులు జరుగనుండగా.. మరునాడే ఎన్నికల షెడ్యూల్ విడుదల కానుంది. మంచిర్యాల, కుమురంభీం జిల్లాల్లోని నాలుగు అసెంబ్లీ స్థానాల్లో ఎన్నికల హడావుడిలో రాజకీయ నాయకులు ఉండగా.. అంతకంటే ముందుగానే బొగ్గు గనుల కార్మిక క్షేత్రంలోనూ గుర్తింపు పోరు వేడిని రాజేసింది. శాసనసభ ఎన్నికలకు రెండు నెలల ముందు జరగనున్న ఈ గుర్తింపు ఎన్నికలు జిల్లాలో రాజకీయాలను అత్యంత ప్రభావితం చేయనున్నాయి.

2017లో గుర్తింపు సంఘ పోలింగ్ తీరు..

డివిజన్	మొత్తం ఓట్లు	పోలైనవి	టీబీజీకేఎస్	ఏఐటీయూసీ	గెలుపు	మెజారిటీ
శ్రీరాంపూర్	11862	11266	6189	3946	టీబీజీకేఎస్	2243
బెల్లంపల్లి	1743	1683	871	675	టీబీజీకేఎస్	196
మందమర్రి	6429	6112	2439	3283	ఏఐటీయూసీ	844

ఇప్పటికే గనులపై ప్రచారాలు..

ఎన్నికలు ఎప్పుడొచ్చినా సిద్ధంగా ఉండేందుకు ఇప్పటికే గనులపై జాతీయ, ప్రాంతీయ కార్మిక సంఘాలు ప్రచారం చేశాయి. ఒక్కో సంఘం ఒక్కో సమస్యను ఎజెండాగా తీసుకొస్తూ, కార్మిక వర్గాల్లో పట్టు పెంచుకునే ప్రయత్నాలు చేశాయి. గత కొంత కాలంగా గుర్తింపు ఎన్నికల నిర్వహణలో జాప్యం జరుగుతుండగా, తాజాగా షెడ్యూల్ ఖరారు కావడంతో ఇక దూకుడు పెంచనున్నాయి. మాజీ గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ కారుణ్య నియామకాలు, లాభాలు, బోనస్, ఇంటి రుణం, ఇళ్లపట్టాలు, మారు పేర్లు, తదితర హామీల అమలు చేశామని ప్రచారం చేస్తుంటే.. ప్రతిపక్ష ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, హెచ్ఎంఎస్, సీఐటీయూసీ, బీఎంఎస్, టీఎన్‌టీయూసీ, తదితర సంఘాలు కార్మికులకు ఇంకా నెరవేరని హామీలపై దృష్టి సారించాయి.

అసెంబ్లీ ఎన్నికలకు గీటురాయి

అధికార పార్టీ బీఆర్ఎస్ అనుబంధ సంఘం టీబీజీకేఎస్‌తో సహా ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, సీఐటీయూసీ, హెచ్ఎంఎస్, తదితర సంఘాలు వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తీవ్ర ప్రభావం చూపనున్నాయి. బీఆర్ఎస్, కాంగ్రెస్, సీపీఐ, బీజేపీ నాయకులకు పరీక్ష పెట్టనుంది. జిల్లాలో బలంగా ఉన్న అధికార పార్టీ, కాంగ్రెస్ మధ్య పోటాపోటీలో కార్మిక క్షేత్రంలో గెలుపెవరిదోనని కార్మిక వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది.

గత ఎన్నికలను పరిశీలిస్తే..

సింగరేణి వ్యాప్తంగా 11డివిజన్లకు గాను 9డివిజన్లలో అధికార పార్టీ అనుబంధ సంఘం టీబీజీకేఎస్ విజయకేతనం ఎగురవేసింది. మిగతా రెండు స్థానాల్లో ఏఐటీయూసీ కూటమి గెలుపొందింది. ఇందులో భూపాలపల్లి, మందమర్రి ఉన్నాయి. జిల్లాలోని శ్రీరాంపూర్ డివిజన్‌లో 11,266 ఓట్లలో 6189 ఓట్లు(54 శాతం) టీబీజీకేఎస్‌కు, 3,946 ఓట్లు(35 శాతం) ఏఐటీయూసీకి పోలయ్యాయి. అదే మందమర్రి డివిజన్‌లో 6,112 ఓట్లలో 3,946 ఓట్లు(53 శాతం) ఏఐటీయూసీ కూటమికి, టీబీజీకేఎస్‌కు 2,439 ఓట్లు (39.90 శాతం) వచ్చాయి. తక్కువ మంది కార్మికులున్న బెల్లంపల్లి డివిజన్‌లో టీబీజీకేఎస్‌కు 871 ఓట్లు(51.75 శాతం), ఏఐటీయూసీకి 675 ఓట్లు(40.10శాతం) లభించాయి

ఓటరు జాబితా పరిశీలన వేగవంతం



పాల్గొన్న జిల్లా కలెక్టర్ బి.సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: ఓటరు జాబితాలో మార్పులు, సవరణలు, తొలగింపు, నూతన ఓటరు దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక ఓటరు జాబితా నమోదు శిబిరాల్లో అందిన దరఖాస్తులను త్వరగా పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని చెప్పారు. ఆదివాసీ గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల వివరాలతో నివేదిక అందించాలని తెలిపారు. జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి బి.సంతోష్ మాట్లాడుతూ ఎన్నికల ఓటరు నమోదు అధికారులు, నియోజకవర్గ స్థాయి అధికారులు, తహసీల్దార్ల సమన్వయంతో ఓటరు నమోదు, మార్పులు, సవరణలు, తొలగింపుల ప్రక్రియను జిల్లాలో పకడ్బందీగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ నెల 19 వరకు జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తామని అన్నారు. జిల్లా అదనపు కలెక్టర్లు మోతీలాల్, రాహుల్, మంచిర్యాల ఆర్డీవో రాములు పాల్గొన్నారు.

పోషణ మాసం అమలయ్యేదెలా..!



బెల్లంపల్లిలో సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

- సమ్మెలో అంగన్‌వాడీ టీచర్లు
- బీఎల్‌వో విధుల్లో కొందరు..
- పోషకాహార మాసంగా సెప్టెంబర్

మంచిర్యాలటౌన్: చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికల్లో పౌష్టికాహార లోపాన్ని అధిగమించేందుకు సెప్టెంబర్ నెలను జాతీయ పోషకాహార మాసంగా గుర్తించి ఐసీడీఎస్ అధికారులు పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అంగన్‌వాడీ టీచర్లు బూత్ లెవల్ అధికారులు(బీఎల్‌వో)గా సేవలు అందిస్తుండగా.. సోమవారం నుంచి జిల్లాలోని 30శాతానికి పైగా అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు, ఆయాలు వారి డిమాండ్ల పరిష్కారానికి సమ్మె బాట పట్టారు. దీంతో పోషకమాసంలో చేపట్టాల్సిన కార్యక్రమాల నిర్వహణ ఐసీడీఎస్ అధికారులకు కష్టంగా మారుతోంది. అంగన్‌వాడీ టీచర్లకు బీఎల్‌వోలుగా విధులు కేటాయించడంతో కొన్ని రోజులుగా ఓటర్ల నమోదు, డబుల్ ఓట్ల తొలగింపు, చిరునామాలో మార్పులు వంటి కార్యక్రమాలు చేపడుతున్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోషణ్ అభియాన్‌లో భాగంగా ఈ నెలలో గర్భిణులు ఆరోగ్య రక్షణ, రక్తహీనత నివారణ, పిల్లల పెరుగుదల పర్యవేక్షణ, పరిశుభ్రత వంటి పలు అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సి ఉంది. బాలికలకు పోషకాహారం ప్రాముఖ్యతపై అవగాహన, తీసుకునే ఆహారంపైనే ఆరోగ్యం ఆధారపడి ఉంటుందని వివరించాల్సి ఉంటుంది. పౌష్టికాహారంతోనే శారీరక వికాసం సాధ్యమని, లేనిపక్షంలో రుగ్మతల బారిన పడే అవకాశం ఉందని అవగాహన కల్పించాలి. గర్భిణులు, బాలింతలు, పిల్లలు, కిశోర బాలికలకు సరైన పౌష్టికాహారం లేకపోవడం, పేదరికం కారణంగా చాలామంది అనారోగ్యం బారిన పడుతున్నారు. ఈ నేపథ్యంలో తీసుకోవాల్సిన ఆహారం, ఆవశ్యకతను వివరించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఈ నెలను జాతీయ పోషకాహార మాసంగా గుర్తించాయి. జిల్లాలోని ఐదు ప్రాజెక్టుల్లో 959 అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహార కార్యక్రమాలు నెలాఖరు వరకు నిర్వహించాల్సి ఉంది. ఇందుకు మహిళా, శిశు సంక్షేమ శాఖ ప్రత్యేకంగా కార్యాచరణ రూపొందించింది. అంగన్‌వాడీ టీచర్లను ఈ నెలలోనైనా అదనపు బాధ్యతల నుంచి తప్పించి, సమ్మె చేస్తున్న వారిని విరమింపజేస్తేనే అన్ని కార్యక్రమాలు విజయవంతానికి అవకాశం ఉంటుంది.

జిల్లా వివరాలు

అంగన్‌వాడీ కేంద్రాలు	969
చిన్నారులు	36,185
గర్భిణులు	4.740
బాలింతలు	3.531

ప్రతీ కేంద్రంలో నిర్వహిస్తాం



జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార మాసాన్ని పురస్కరించుకుని ప్రతీరోజు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాం. అంగన్‌వాడీ టీచర్లు బీఎల్‌వో విధులు నిర్వహిస్తున్న చోట ఇతర అంగన్‌వాడీ సిబ్బంది సహాయంతో కార్యక్రమాలు కొనసాగిస్తాం. కొందరు టీచర్లు మాత్రమే సమ్మెలో ఉన్నారు. ఆయా చోట్ల ప్రత్యామ్నాయంగా కార్యక్రమాలు నిర్వహించేలా చూస్తాం. సమ్మె లేని చోట ప్రతీ అంగన్‌వాడీ కేంద్రంలో పోషక మాసం నిర్వహిస్తున్నాం.

– చిన్నయ్య, జిల్లా సంక్షేమ శాఖ అధికారి. మంచిర్యాల

ప్రత్యేక కార్యక్రమాలు

పోషణ్ అభియాన్‌లో భాగంగా ఈ నెల ఒకటి నుంచి 30వరకు పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంది. పిల్లల ఎత్తు, బరువు, గర్భిణుల బరువు, భుజం కొలతలు తీసుకోవడం, పోషకాహారంపై అవగాహన కల్పిస్తూ రోగ నిరోధక శక్తి పెంచే కార్యక్రమాలు చేపట్టాలి. అంగన్‌వాడీ కేంద్రాల్లో కిచెన్ గార్డెన్ల ఏర్పాటు, కూరగాయలు, పండ్ల మొక్కలు, ఆకుకూరలు, సీ విటమిన్ అధికంగా ఉండే పండ్ల తోటల పెంపకం, ఆరోగ్యం కోసం యోగాసనాలు చేపట్టనున్నారు. పిల్లల్లో రోగ నిరోధక శక్తి పెంపొందించడం, గర్భిణులకు కౌన్సెలింగ్, న్యూట్రీషన్ ఫుడ్‌పై అవగాహన, స్థానికంగా లభించే ఆహారాలను ప్రదర్శించి మిల్లెట్స్, కూరగాయలు లబ్ధిదారులకు వివరించాల్సి ఉంటుంది. పోషకాహారంపై విద్యార్థులకు రోజువారీ సందేశాలు ఇస్తూ, వ్యాసరచన, చిత్రలేఖనం, పోస్టర్ల తయారీ, హ్యాండ్‌వాష్ ప్రదర్శనలు, తల్లిదండ్రులతో సమావేశాలు, పిల్లల ఎదుగుదలకు అవసరమైన పౌష్టికాహారంపై అవగాహన కల్పించాల్సి ఉంది.

సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

- జిల్లా అదనపు కలెక్టర్లు
- ప్రజావాణిలో అర్జీల స్వీకరణ



అర్జీ స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ మోతీలాల్

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రజా సమస్యలు సత్వరమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్లు మోతీలాల్, రాహుల్ అన్నారు. సోమవారం నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్‌లో వివిధ మండలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఫిర్యాదులను పరిశీలించి పరిష్కారానికి సంబంధిత అధికారులను ఆదేశించారు. పలుమార్లు వస్తున్న భూ సమస్యల ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కారానికి కృషి చేయాలని చెప్పారు. నష్టపరిహారం అందించాలని ఎల్లంపల్లి ముంపు బాధితులు, భూ మార్పిడి, నమోదులో తప్పిదాలు, అక్రమాలు, విరాసత్ తదితర వాటిపై కన్నెపల్లి, బెల్లంపల్లి తదితర మండలాల నుంచి దరఖాస్తులు అందాయి. బీడీ పింఛన్ మంజూరు చేయాలని మంచిర్యాలకు చెందిన అలవోజు శ్రీజ కోరింది. బెల్లంపల్లి ఆర్డీవోలు సురేష్, రాములు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నష్ట పరిహారం అందించాలి



జైపూర్ పవర్‌ప్లాంటు నుంచి వరోరా, కర్నూల్ వైపు వెళ్తున్న 765కేవీడీసీ విద్యుత్ సరఫరా లైన్ కారణంగా మా సర్వేనంబరు 35, 36లో నష్టం జరిగింది. 12 మామిడిచెట్లు, ఎర్రచందనం చెట్లు, కంచె, పంపు మోటార్ తొలగించడం వల్ల నష్టపోయాం. 2019 నుంచి ఇప్పటివరకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. ఇప్పటికైనా పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలి.

– బాధితురాలు రాజేశ్వరి, జైపూర్

డీడీలు చెల్లించి నాలుగేళ్లు



రాయితీపై ప్రభుత్వం గేదెలు అందజేస్తుందని పశుసంవర్థక శాఖ అధికారులు తెలుపడంతో 2019లో రూ.40వేల చొప్పున పది మంది పాడిరైతులు డీడీలు కట్టాం. కానీ ఇంతవరకు గేదెలు ఇవ్వలేదు. డీడీలైనా తిరిగివ్వాలి. లేదా పాడిగేదెలైనా పంపిణీ చేయాలి.

– పాడిరైతులు సతీష్, వెంకటేష్, రమేష్, గ్రామం: మోత్కూర్, మం: లక్సెట్టిపేట

శిథిలావస్థలో బడి



నార్లపూర్ గ్రామ ప్రభుత్వ పాఠశాల శిథిలావస్థలో ఉంది. ఎప్పుడు కూలి పిల్లలపై పడుతుందోనని తల్లిదండ్రులు భయంభయంగా పంపిస్తున్నారు. మన ఊరు –మన బడిలో కొత్త పాఠశాల నిర్మించాలని డీఈవోకు పలుమార్లు విన్నవించాం. ఇప్పటికైనా శ్రద్ధ వహించి ప్రమాదం జరగకముందే పాఠశాలను మరమ్మతులు, పనులు చేపట్టాలి.

– మేసినేని ప్రణయ్, బొలిశెట్టి వేణు, గ్రామం: నార్లపూర్, మం: మందమర్రి

రుణమాఫీ నగదు రాలేదు..



ఎకరన్నర వ్యవసాయ భూమిపై 2018లో రూ.44 వేలు రుణం తీసుకున్నాను. ప్రభుత్వం రుణమాఫీ సొమ్ము నాకు ఇంతవరకు జమ కాలేదు. బ్యాంకుకు వెళ్తే ఇంకా రాలేదు అంటున్నారు. అందరికీ వచ్చాయి. రుణమాఫీ నగదు అందేలా చర్యలు తీసుకోవాలి.

– బుర్ర భీమేష్, గ్రామం: ఘన్‌పూర్, మం: నెన్నెల

ఆరని అసంతృప్తి!

- బీఆర్ఎస్‌లో 'మాజీల తీరుతో బేజారు
- ఫలించని జిల్లా నాయకత్వ బుజ్జగింపులు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: బీఆర్ఎస్‌లో అసంతృప్తి పోరు చల్లారడం లేదు. మాజీ ఎమ్మెల్యేల తీరుతో పార్టీలో కలవరం తగ్గడం లేదు. మంచిర్యాలలో అభ్యర్థిని మార్చాలని మాజీ ఎమ్మెల్యే అరవింద్‌రెడ్డి పట్టుబడుతున్నారు. మూడు రోజుల క్రితం ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మంత్రి కేటీఆర్‌ను కలిసి ఇక్కడి పరిస్థితిని వివరించారు. తాజాగా మరోసారి ఆయన అభ్యర్థిని మార్చాలని స్పష్టం చేశారు. తనకు గానీ, బీసీ అభ్యర్థికి గానీ టికెట్ ఇస్తే, 70నుంచి 80వేల మెజార్టీతో గెలుస్తారని చెప్పారు. ఈ క్రమంలో ఆ పార్టీ అధ్యక్షుడు బాల్క సుమన్ చేసిన ప్రయత్నాలు ఏవీ ఫలించడం లేదు. మంచిర్యాల నియోజకవర్గంలో ఇప్పటికే పలువురు నాయకులు అసంతృప్తి కారణంగా పార్టీని వీడుతున్నట్లు ప్రకటిస్తుండగా, అరవింద్‌రెడ్డి అభ్యర్థిని మార్చాలని పట్టుబడుతుండడంతో ఇది ఎక్కడికి దారి తీస్తుందోనని జిల్లాలో చర్చించుకుంటున్నారు. మరోవైపు తాను వెనక్కి తగ్గడం లేదని, ప్యాకేజీకి అమ్ముడు పోనని మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు వర్గానికి కౌంటర్ ఇచ్చారు. ఇటీవల మంత్రి కేటీఆర్‌ను కలిసిన నేపథ్యంలో పలు ఊహాగానాలకు ఆయన చెక్ పెట్టే ప్రయత్నం చేశారు. మరోవైపు బీసీ నాయకులకు ఆయన మద్దతు తెలుపుతున్నారు. ఈ పరిణామాలు నియోజవకర్గంలో ఆసక్తిగా మారాయి.

'నల్లాల' నిర్ణయమేంటో?

చెన్నూరు మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు తన రాజకీయ నిర్ణయంపై ఇంకా స్పష్టత రావడం లేదు. గత కొంతకాలంగా అసంతృప్తిగా ఉన్న ఆయన పార్టీని వీడేందుకు సిద్ధపడినట్లు సమాచారం. ఎటువంటి ప్రోటోకాల్ లేకుండా సీనియర్ నాయకుడిగా ఉన్న ఆయనకు ఇబ్బందిగా మారడంతోనే పార్టీని వీడేందుకు తెగించినట్లు తెలుస్తోంది. గత ఏడాది కాంగ్రెస్ పార్టీలో చేరి, మళ్లీ బీఆర్ఎస్ పార్టీకి వచ్చారు. ఆ సమయంలో మంత్రి కేటీఆర్‌తో సముచిత ప్రాధాన్యత కల్పిస్తారని హామీ తీసుకున్నారు. ఇప్పటికీ ఆయనకు ఎటువంటి పదవీ దక్కలేదు. ఈ కారణంతో ఓ నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. ఇప్పటికే బీజేపీ నాయకులతో చర్చలు జరిపినట్లు సమాచారం. గతంలో టీఆర్ఎస్‌లో తనకు సన్నిహితంగా ఉన్న నాయకుడితో సంప్రదింపులు అయినప్పటికీ ఇంకా నిర్ణయం వెల్లడించలేదు. అక్కడి నుంచి టికెట్ హామీ రాలేదా? మరేదైనా కారణమో తెలియదు కానీ, పార్టీ మార్పు పలు రకాలుగా ఆలోచనలు చేస్తున్నట్లు తెలుస్తోంది. తన కుటుంబం, అనుచరులు, పార్టీ నాయకులు తదితర వారితో చర్చించుకుని రాజకీయ భవిష్యత్‌పై ఓ ప్రకటన చేసే అవకాశం ఉంది.

మంచిర్యాల బీఆర్ఎస్ అభ్యర్థిని మార్చాల్సిందే..!

- మాజీ ఎమ్మెల్యే గడ్డం అరవింద్‌రెడ్డి
- బీసీ అభ్యర్థి ఎన్నికల ఖర్చుకు భూమి విరాళం



అరవింద్‌రెడ్డికి భూమి పత్రాలు అందిస్తున్న ప్రకాశ్‌రావు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల అసెంబ్లీ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావును మార్చాల్సిందేనని, తనకు గానీ, బలమైన బీసీ అభ్యర్థికి గానీ బీఆర్ఎస్ టికెట్ ఇవ్వాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు వివరించానని మాజీ ఎమ్మెల్యే గడ్డం అరవింద్‌రెడ్డి స్పష్టం చేశారు. సిట్టింగ్ ఎమ్మెల్యే పోటీలో ఉంటే కాంగ్రెస్ అభ్యర్థి ప్రేమ్‌సాగర్‌రావు గెలిచే అవకాశాలున్నాయని వివరించినట్లు చెప్పారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని తన నివాసంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. కొందరు నాయకులు తనపై అనవసర దుష్ప్రచారం చేస్తున్నారని ఖండించారు. తన తండ్రి నర్సింహారెడ్డి, తాను రాజకీయాల్లో ప్రజాసేవకు ఆస్తులు అమ్ముకున్నామని తెలిపారు. ప్రస్తుతం పదెకరాల భూమి కూడా లేదని అన్నారు. మంచిర్యాలలో ఏ పార్టీ గెలిస్తే ఆ ప్రభావం తూర్పు ప్రాంతంలోని మిగతా ఐదు నియోజకవర్గాలపై ఉంటుందని తెలిపారు. కాంగ్రెస్ టికెట్లు ఇస్తానంటూ పలువురు నుంచి ప్రేంసాగర్‌రావు డబ్బులు తీసుకుంటున్నారని, వచ్చే ఎన్నికల్లో గెలుస్తానంటూ రియల్ ఎస్టేట్ వ్యాపారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నాడని ఆరోపించారు. తాను బీజేపీలోకి వెళ్తున్నట్లు ప్రచారం చేస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో ప్రేంసాగర్‌రావును ఓడించేందుకు బీజేపీతోపాటు ఏ పార్టీలోకి అయినా వెళ్తానని, స్వతంత్ర అభ్యర్థిగానైనా పోటీ చేసి ప్రేంసాగర్‌రావును ఓడిస్తానని తెలిపారు.

బీసీ అభ్యర్థి ఖర్చులకు భూమి దానం..

మంచిర్యాల నుంచి బీఆర్ఎస్ పార్టీ లేదా స్వతంత్ర అభ్యర్థిగా బీసీ నుంచి బలమైన అభ్యర్థిగా పోటీ చేసే వారికి తన 30 గుంటల భూమిని ఎన్నికల ఖర్చు కోసం దానం చేస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాశ్‌రావు ప్రకటించారు. ఇందుకు సంబంధించిన భూమి పత్రాలను మాజీ ఎమ్మెల్యే గడ్డం అరవింద్ రెడ్డికి అందజేశారు. తన పేరిట పెద్దపల్లి జిల్లా బ్రహ్మణపల్లి గ్రామంలో ఉన్న 30 గుంటల భూమి దాదాపు రూ.15 లక్షల వరకు గుంట చొప్పున విలువ ఉందని తెలిపారు. బీసీ అభ్యర్థి ఈసారి ఎమ్మెల్యేగా ఉండాలని ఆకాంక్షతో అందిస్తున్నట్లు తెలిపారు. నడిపెల్లి దివాకర్‌రావు గానీ, ప్రేమ్‌సాగర్‌రావు గానీ గెలిచేందుకు వీలు లేదని, బీసీ అభ్యర్థి గెలవాలని ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు.

బీసీలకే ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలి



దీక్ష శిబిరంలో నాయకులు

పాతమంచిర్యాల: బీసీలకే మంచిర్యాల నియోజకవర్గ ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాశ్‌రావు, బీసీ రాజ్యాధికార సమితి నాయకులు అన్నారు. సోమవారం మంచిర్యాల ఐబీ చౌరస్తాలో బీసీ రాజ్యాధికార సాధన సమితి ఆధ్వర్యంలో మంచిర్యాల నియోజకవర్గంలో బీసీలకే ఎమ్మెల్యే టికెట్ కేటాయించాలనే డిమాండ్‌తో ఒక్క రోజు నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 95శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలు ఉన్నప్పటికీ అగ్రవర్ణ కులాల వారే రాజ్యాధికారం చేపట్టారని తెలిపారు. రాజకీయ పార్టీలు బీసీలకు టికెట్ ఇవ్వకుంటే బీసీ ఉమ్మడి అభ్యర్థిని స్వతంత్రగా ఎన్నికల బరిలో నిలిపి భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని తెలిపారు. బీసీ సామాజికవర్గం వ్యక్తి పోటీ చేస్తే తాను రూ.3కోట్లు ఖర్చు చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు గోనె ప్రకాశ్‌రావు ప్రకటించారు. దీక్షకు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు, కులసంఘాల నాయకులు, ఆమ్‌ఆద్మీ పార్టీ, బీజేపీ, బీఎస్పీ, విశ్వ బ్రాహ్మణ సంఘం, ప్రైవేట్‌స్కూల్ యాజమాన్యాల సంఘం, బార్ అసోసియేషన్, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు సంఘీభావం తెలిపారు. ఎమ్మెల్యే ఆశావహులు గాజుల ముఖేష్‌గౌడ్, నీలి శ్రీనివాస్, డాక్టర్ రమణ, డాక్టర్ రఘునందన్, రాపోలు విష్ణువర్ధన్, ఉదారి చంద్రమోహన్, చుంచు రాజ్‌కిరణ్, బియ్యాల సత్తయ్య, కర్రె లచ్చన్న, నాయకులు రంగు రాజేశంగౌడ్, పడాల రామన్న, ఖలిందర్ అలీఖాన్, అందె మంగ, లాలకుమార్, అడ్వకేట్‌లు లచ్చన్న, సత్తన్న పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ఉచిత శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

ఉట్నూర్‌రూరల్(ఖానాపూర్): ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన నిరుద్యోగ యువతీ యువకులకు ఆయా విభాగాల్లో ఇవ్వనున్న ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్, ఏర్పోర్టు క్యాంపస్ ఆధ్వర్యంలో యువకులకు వెల్డింగ్, డ్రై వాల్/ఫాల్ సీలింగ్, హోటల్ మేనేజ్‌మెంట్, ఎలక్ట్రీషియన్, రిఫ్రిజిరేటర్ / ఎయిర్ కండీషన్, బైక్ మెకానిక్ కోర్సుల్లో, యువతులకు నాగారం, సిరిసిల్ల క్యాంపస్‌లో హోమ్ హెల్త్ ఎయిడ్ కోర్సుల్లో మూడునెలల పాటు ఉచిత శిక్షణతో పాటు వసతి, భోజన సౌకర్యం కల్పించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ నెల 13న ఉదయం 10 గంటలకు ఉట్నూర్ కేబీకాంప్లెక్స్ ప్రాంగణంలో ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. 18 నుంచి 30 సంవత్సరాలలోపు ఉండి ఎస్ఎస్‌సీ పాస్ లేదా ఫెయిల్, ఐటీఐ లేదా డిప్లొమా ఎలక్ట్రికల్ విద్యార్హత ఉన్నవారు అర్హులన్నారు.

సైక్లింగ్ అకాడమీకి ఎంపిక



విష్ణువర్ధన్

బెల్లంపల్లి: బెల్లంపల్లికి చెందిన కోట విష్ణువర్ధన్ సైక్లింగ్ అకాడమీలో సీటు సాధించాడు. 2023–24 విద్యాసంవత్సరానికి గాను అకాడమీలో ప్రవేశంకోసం ఇటీవల ఎంపిక పోటీలు నిర్వహించగా విష్ణువర్ధన్ ప్రతిభ కనబరిచి హైదరాబాద్‌లో ఉన్న సైక్లింగ్ అకాడమీకి ఎంపికైనట్లు ప్రభుత్వ ఫిజికల్ డైరెక్టర్ బాబురావు తెలిపారు. సదరు విద్యార్థి ప్రస్తుతం జైపూర్‌లోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. తమ కళాశాల విద్యార్థి సైక్లింగ్ అకాడమీకి ఎంపిక కావడంతో ప్రిన్సిపాల్ బాలభాస్కర్ హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కేజీబీవీ విద్యార్థినికి అస్వస్థత

జన్నారం: కస్తూరిబా గాంధీ పాఠశాలలో తోటి విద్యార్థులు ఆటపట్టించే క్రమంలో ఉపాధ్యాయురాలు కొట్టడం వల్ల ఓ విద్యార్థినికి చేతికి గాయమై అస్వస్థతకు గురైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం కేజీబీవీలో ఎనిమిదో తరగతి చదువుతున్న శరణ్య ఈనెల 9న పాఠశాలలో బాత్‌రూమ్‌కు వెళ్లగా తోటి విద్యార్థులు బయటనుంచి గడియపెట్టారు. విషయం తెలుసుకున్న కొందరు విద్యార్థులు ఇంగ్లిష్ టీచర్ చేత గడియ తీయించి బయటకు తీసుకువచ్చారు. భయంతో శరణ్య అస్వస్థతకు గురైంది. కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చి ఇంటికి పంపించారు. విద్యార్థిని చేయి వాచిపోవడంతో గ్రామంలోని ఆర్‌ఎంపీ వైద్యునికి చూపించారు. ఈ విషయంపై విద్యార్థిని కుటుంబసభ్యులను సంప్రదించగా టీచర్ కొట్టడం వల్ల అమ్మాయి భ యంతో స్పృహతప్పినట్లు తెలిపారు. చేయి వా యడంతో పట్టికట్టించినట్లు తెలిపారు. పాఠశా ల స్పెషల్ ఆఫీసర్ శ్రీవాణిని సంప్రదించగా స్ప హ తప్పడంతో చెంపమీద కొట్టినట్లు తెలిపా రు.

బావిలోపడి వృద్ధురాలు ఆత్మహత్య

లక్సెట్టిపేట: మండలంలోని ఎల్లారం గ్రామానికి చెందిన సరోజన(80) బావిలోపడి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై లక్ష్మణ్ తెలిపారు. గ్రామానికి చెందిన సరోజన కొంతకాలంగా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతోంది. దీంతో మనస్తాపానికి గురై సోమవారం ఉదయం సమీప వ్యవసాయ బావిలో పడి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి కుమార్తె పుష్పలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎవరెస్ట్ వైపు తొలి అడుగు..

- పర్వతారోహణ శిక్షణకు కార్తీక్
- ఈ నెల 15న సిక్కింకు పయనం..
- ఎవరెస్ట్, కిలిమంజారో పర్వతాలు ఎక్కేందుకు మార్గం సుగమం
- సాహస కృత్యాలతోపాటు కళల్లో రాణిస్తున్న కుమురంభీం జిల్లా యువకుడు



ఇచ్చోడలో నిర్వహించిన పోటీల్లో క్లైంబింగ్ చేస్తున్న కార్తీక్ (ఫైల్)



తల్లిదండ్రులతో కార్తీక్

కెరమెరి(ఆసిఫాబాద్): ఆశయ సాధనకు పేదరికం అడ్డుకాదని నిరుపిస్తున్నాడు.. కుమురంభీం జిల్లా కెరమెరి మండలం కెలి కె గ్రామానికి చెందిన గిత్తే కార్తీక్. సాహస కృత్యాల్లో రాణిస్తూనే, మరోవైపు కళల్లోనూ తన ప్రతిభను చూపుతున్నాడు. తన గమ్యం ఎవరెస్ట్ అధిరోహించడమే అని చెబుతున్న కార్తీక్.. తాజాగా సిక్కిం రాష్ట్రంలో నిర్వహించే పర్వతారోహణ శిక్షణకు ఎంపికయ్యాడు.

తెలంగాణ నుంచి ఐదుగురు..

కెలి కె గ్రామానికి చెందిన గిత్తే రుక్మాజీ, ఇటాబాయిల కుమారుడు కార్తీక్ ప్రస్తుతం మంచిర్యాల జిల్లా చెన్నూర్‌లోని మైనార్టీ గురుకుల కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్నాడు. సిక్కింలోని నామ్‌చా జిల్లాలో ఈనెల 18 నుంచి అక్టోబర్ 16 వరకు విద్యార్థులకు పర్వతారోహణ శిక్షణ అందించనున్నారు. ఈ శిక్షణకు తెలంగాణ నుంచి ఐదుగురు ఎంపిక కాగా.. ఉమ్మడి ఆదిలాబాద్ నుంచి కార్తీక్ ఒక్కరే ఉన్నారు. నెల రోజులపాటు కొనసాగే ఈ కఠినమైన శిక్షణ పూర్తయితే ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన పర్వతం ఎవరెస్ట్‌తోపాటు కిలిమంజారో వంటి శిఖరాలు అధిరోహించేందుకు అనుమతి లభిస్తుంది. ఈ నెల 15న సిక్కింకు బయలుదేరనున్నాడు. కాగా కార్తీక్ ఇప్పటికే బోనగిరిలోని రాక్‌లైన్ స్కూల్ ఆధ్వర్యంలో జూన్ 19న బోనగిరి గుట్టపై 150 ఫీట్ల రాఫెల్లింగ్, 150 ఫీట్ల క్లైంబింగ్‌తోపాటు 650 ఫీట్ల ఎత్తు వరకు ట్రెక్కింగ్ పూర్తి చేశారు. 30 ఫీట్ల బౌల్ట్రింగ్, 10 మీటర్ల జిప్‌లైన్‌లోనూ ప్రతిభ చూపాడు. దీంతో బోనగిరి రాక్‌లైన్ స్కూల్ ఆధ్వర్యంలో సిక్కింలో అందించే శిక్షణకు ఎంపికయ్యాడు. కుటుంబ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా కలెక్టర్ హేమంత్ బోర్కడే రూ.20 వేల ఆర్థిక సాయం అందించారు.

మాలావత్ పూర్ణ స్ఫూర్తి

> 13 ఏటనే ఏడు పర్వతాలు అధిరోహించిన నిజామాబా ద్ జిల్లాకు చెందిన మాలా వత్ పూర్ణను స్ఫూర్తిగా తీసుకుని సాహస కృత్యాల్లో పాల్గొంటున్నా. ట్రెక్కింగ్, క్లైంబింగ్‌తోపాటు కవితలు రాయడం, చెస్ ఆడటం అంటే ఇష్టం. పేదరికంతో ఆర్థిక కష్టాలు వెంటాడుతున్నాయి. ఆర్థికంగా అండగా ఉంటే రాష్ట్రం పేరు నిలబెడతా.. – గిత్తే కార్తీక్

ఇతర కళల్లోనూ నేర్పరి

సాహస కృత్యాలతోపాటు కార్తీక్ ఇతర కళల్లోనూ నేర్పరి. పాఠశాల స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు పలు పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపాడు. వజ్రోత్సవం సందర్భంగా జాగృతి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన కవి సమ్మేళనంలో మొదటిస్థానంలో నిలిచాడు. హైదరాబాద్‌లో నిర్వహించిన ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ పోటీల్లో పతకం సాధించాడు. ఇచ్చోడలో జరిగిన వాటర్‌ఫాల్ పోటీల్లోనూ పాల్గొని సత్తా చాటాడు. గతంలో నేపాల్‌లో జరిగిన చెస్ పోటీల్లో పాల్గొనేందుకు ఆర్థిక ఇబ్బందులు ఎదురుకాగా ప్రజాప్రతినిధులు, అప్పటి కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆర్థికసాయం అందించి ఆదుకున్నారు.



సన్మానం అందుకుంటున్న కార్తీక్

వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలు సాధించాలి



ఐకే ఓసీపీని పరిశీలిస్తున్న డైరెక్టర్

జైపూర్(చెన్నూర్): వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలు సాధించేందుకు ప్రణాళిక బద్ధంగా ముందుకెళ్లాలని సింగరేణి డైరెక్టర్ ప్రాజెక్టు, ప్లానింగ్ జి.వెంకటేశ్వర రెడ్డి సూచించారు. మండలంలోని ఇందారం ఓపెన్ కాస్టు గనిని సోమవారం శ్రీరాంపూర్ జీఎం సంజీవ రెడ్డితో కలిసి సందర్శించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తే లక్ష్యంగా రోజువారి ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. భవిష్యత్ ప్రణాళికలు, బొగ్గు రవాణాపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఐకే ఓసీపీ పీవో శ్రీనివాస్, గని మేనేజర్ రవికుమార్, ప్రాజెక్టు ఇంజినీర్ రమేశ్, ఆపరేషన్స్ మేనేజర్ బ్రహ్మాజిరావు ఉన్నారు.

గైర్హాజర్ ఉద్యోగులకు కౌన్సిలింగ్



కౌన్సిలింగ్ చేస్తున్న డీజీఎం అరవిందరావు

నస్పూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్‌కే 5, ఆర్‌కే 6, సీహెచ్‌పీల్లో పనిచేస్తూ గైర్హాజరైన ఉద్యోగులకు సోమవారం శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం సమావేశ మందిరంలో డీజీఎం (పర్సనల్) అరవింద రావు ఫ్యామిలీ కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఉద్యోగి హాజరు శాతం పెంచుకోవాలని సూచించారు. ఆరోగ్య సమస్యలు ఉంటే రిపోర్టులు పరిశీలించి తగు న్యాయం చేస్తామన్నారు. కౌన్సిలింగ్‌కు 55 మంది ఉద్యోగులు తమ కుటుంబ సభ్యులతో కలిసి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు కే.సురేందర్‌రెడ్డి, డీవైసీఎంవో డాక్టర్ రమేశ్‌బాబు, డీవైపీఎంలు రాజేశ్వర్‌రావు, రాజేశ్, సీనియర్ పీవో ప్రకాశ్, గని సంక్షేమాధికారి సునీల్, తదితరులు పాల్గొన్నారు.

హత్యకేసులో నిందితుడి రిమాండ్



నిందితుడితో సీఐ శ్రీనివాస్, ఎస్సై తేజశ్విని

వాంకిడి: ఇటీవల జరిగిన హత్య కేసులో నిందితుడిని సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని సోయంగూడకు చెందిన భరత్, పర్చాకి రాంషావు ఈ నెల 8న కెరమెరి మండలంలోని సాకెడ గ్రామానికి వెళ్లి వస్తుండగా వెల్గీ గ్రామం వద్ద భరత్‌పై రాంషావు కర్రతో దాడిచేయగా చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారు జామున మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు నిందితుడు రాంషావును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

జైపూర్‌లో పంచాయతీరాజ్ సబ్ డివిజన్ ఏర్పాటు



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీలు, జెడ్పీటీసీలు, అధికారులు

జైపూర్: ఇంతకాలం చెన్నూర్ సబ్‌డివిజన్‌లో కొనసాగిన మూడు మండలాలను విడదీస్తూ కొత్తగా జైపూర్ కేంద్రంగా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం ఉపకార్య నిర్వాహక ఇంజనీయర్ కార్యాలయం ఏర్పాటు చేశారు. జైపూర్, భీమారం, మందమర్రి మండలాలను కలుపుతూ జైపూర్ సబ్ డివిజన్‌గా నూతనంగా ఏర్పాటు చేయగా తాత్కాలికంగా జైపూర్ ప్రభుత్వ ఆస్పత్రి పాత భవనంలో కార్యాలయాన్ని సోమవారం ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. జైపూర్, మందమర్రి ఎంపీపీలు గోదారి రమాదేవి, గుర్రం మంగాగౌడ్, జైపూర్, మందమర్రి జెడ్పీటీసీలు మేడి సునిత, వేల్పుర రవి, డీఈ స్వామిరెడ్డి పాల్గొన్నారు. అనంతరం నూతన సబ్ డివిజన్ డీఈగా స్వామిరెడ్డి బాధ్యతలు స్వీకరించారు.

బైక్ అదుపుతప్పి ఒకరికి గాయాలు



గాయపడిన మధుకర్

తిర్యాణి: బైక్ అదుపుతప్పి ఒకరికి గాయాలపాలైన సంఘటన సోమవారం మండలంలోని గడలపెల్లి శివారులో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన కోట్నాక మధుకర్ స్థానిక ప్రభుత్వ కళాశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కళాశాలకు సంబంధించిన బిల్లులను ఆసిఫాబాద్‌లోని కార్యాలయంలో అందజేసి వస్తుండగా గడలపెల్లి గ్రామ శివారులోని వాగుపై ఉన్న బ్రిడ్జి సమీపంలో బైక్ అదుపుతప్పి కిందపడడంతో గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం బెల్లంపెల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కోచ్‌కే కోచింగ్ ఇస్తానని మోసం

- రూ.3 లక్షలు కాజేసిన వైనం

మంచిర్యాలక్రైం: క్రికెట్ కోచింగ్ ఇచ్చే వ్యక్తికి ట్రేడ్ మార్కెటింగ్‌లో కోచింగ్ ఇస్తానని మాయమాటలు చెప్పి రూ.3.9 లక్షలు కాజేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జగదీష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం స్థానిక ఎడ్లవాడలో నివాసం ఉంటున్న గట్టు సంతోష్ క్రికెట్ కోచింగ్ ఇస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతని వద్దకు స్థానిక శ్రీనివాస్ టాకీస్ సమీపంలో ఉంటున్న చెవ్వ రవి తన కుమారుడు చేతన్‌ను సంతోష్ వద్దకు క్రికెట్ కోచింగ్‌కు పంపించేవాడు. 2022 డిసెంబర్‌లో ట్రేడ్ మార్కెటింగ్ నేర్పిస్తానని రవి చెప్పడంతో సంతోష్ రూ.2 లక్షల 59 వేలు ఫోన్‌పే చేశాడు. కొంతకాలం తర్వాత మరిన్ని డబ్బులు కావాలని చెప్పడంతో రూ.50 వేలు నగదురూపంలో చెల్లించాడు. ఇప్పటి వరకూ ట్రేడ్ మార్కెటింగ్‌లో శిక్షణ ఇవ్వకపోగా తీసుకున్న నగదు కూడా ఇవ్వడంలేదు. గట్టిగా అడిగితే దిక్కున్నచోట చెప్పుకొమ్మని బెదిరించాడు. మరోసారి ఇంటికి వచ్చి డబ్బులు అడిగితే చంపుతానని బెదిరించాడు. దీంతో సంతోష్ తల్లి గట్టు ప్రమీల ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడు రవిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

రేషన్ బియ్యంపట్టివేత

జైనూర్: మండల కేంద్రంలోని ముత్యపువార్ అశోక్ దుకాణంలో సోమవారం 10 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్ తెలిపారు. తమకు అందిన పక్కా సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. బియ్యం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై సందీప్‌కుమార్ తెలిపారు. ఆయన వెంట పోలీసు సిబ్బంది మధు, రమేష్, సంజీవ్, తదితరులు ఉన్నారు.

ప్రమాదాల నివారణకు కృషి చేయాలి



మాట్లాడుతున్న భూషన్ ప్రసాద్ సింగ్

నస్పూర్: సింగరేణిలో ప్రమాదాల నివారణ ప్రతీ ఉద్యోగి కృషి చేయాలని డెప్యూటీ డైరెక్టర్ ఆఫ్ జనరల్ మైన్స్ సేఫ్టీ భూషన్ ప్రసాద్ సింగ్ సూచించారు. సోమవారం సీసీసీలోని సింగరేణి గెస్ట్ హౌజ్‌లో అధికారులు, సంఘాల నాయకులతో శ్రీరాంపూర్ ఏరియా లెవల్ 22వ త్రైపాక్షిక సేఫ్టీ రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఉద్యోగికి రక్షణ సూత్రాలు తెలిసి ఉండాలన్నారు. రక్షణకు తీసుకుంటున్న చర్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. రక్షణ చర్యల్లో భాగంగా నూతన సాంకేతికతను వినియోగించుకోవాలన్నారు. అంతకుముందు గెస్ట్ హౌజ్ ఆవరణలో మొక్క నాటారు. సమావేశంలో డైరెక్టర్లు వెంకటేశ్వరరెడ్డి, ఎన్ నాగేశ్వర్‌రావు, బెహార, డెప్యూటీ డైరెక్టర్లు ఆర్ముగం, బానోత్ వెంకన్న, రజీవ్ ఓం ప్రకాశ్, సేఫ్టీ జనరల్ మేనేజర్(కార్పోరేట్) సుభాని, శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి, అధికారులు జార్జ్ జాన్, కేహెచ్ ఎస్ గుప్తా, ఎస్‌వోటూ జీఎం రఘుకుమార్, టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు కే.సురేందర్‌రెడ్డి, ఏఐటీయూసీ నాయకులు ఎస్‌కే బాజీసైదా, హెచ్ఎంఎస్ నాయకులు సారయ్య, ఐఎన్టీయూసీ నాయకులు జే.శంకర్ రావు, సీఐటీయూ నాయకులు భాగ్యరాజు, బీఎంఎస్ నాయకులు శ్రీధర్, అధికారుల సంఘం నాయకులు అబ్దుల్ ఖాధీర్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి



ప్రసాద్ (ఫైల్)

మంచిర్యాలక్రైం: ఈ నెల 8న రాత్రి పాత మంచి ర్యాల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి న వ్యక్తి ఎంజీఎంలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు ఎస్సై జగదీష్ తెలిపారు. పాత మంచిర్యాలకు చెందిన సల్లం లింగయ్య–మల్లీశ్వరి దంపతుల కుమారుడు ప్రసాద్ (32) ఈ నెల 8న రాత్రి రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహా నం ఢీకొట్టింది. తీవ్ర గాయాలు కావడంతో వ రంగల్‌లోని ఎంజీఎంకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

అదుపుతప్పి కారు బోల్తా

ఉట్నూర్‌రూరల్: మండలంలోని లక్కారం సమీపంలో కారు అదుపుతప్పి బోల్తా పడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం రాత్రి దంతన్‌పల్లికి చెందిన కారు మత్తడిగూడ నుంచి ఉట్నూర్ వైపు వెళ్తుండగా అదుపుతప్పి విద్యుత్‌స్తంభాన్ని ఢీకొట్టి పంట పొలాల్లోకి దూసుకెళ్లింది. ఘటనలో ఎవరికీ గాయాలు కాకుండా బయటపడ్డారు.

పోరాటాలతోనే హక్కుల సాధన



మాట్లాడుతున్న వీరభద్రయ్య

నస్పూర్: సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం, హక్కుల సాధన పోరాటాల ద్వారనే సాధ్యమని ఏఐటీయూసీ డెప్యూటీ ప్రధాన కార్యదర్శులు కే.వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా అన్నారు. సోమవారం ఆర్‌కే 7, ఆర్‌కే న్యూటెక్, ఆర్‌కే 5 గనులపై గేట్‌మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి కార్మికులకు చెల్లించాల్సిన 11వ వేజ్ బోర్డు 23 నెలల ఏరియర్స్‌ని రెండు దఫాలుగా చెల్లిస్తామని సింగరేణి యాజమాన్యం ప్రకటించడంతో ఏఐటీయూసీ నిరసనలు చేపట్టి ఒకే ధఫాలో చెల్లించడానికి అంగీకరించేలా చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా కార్యదర్శి మారపల్లి సారయ్య, బ్రాంచి ఆర్గనైజింగ్ కార్యదర్శి సంపత్, పిట్ కార్యదర్శి లక్ష్మణ్, నాయకులు రమేశ్, బీర రవీందర్, ప్రతాప్, నర్సింహారావు, అఫ్రోజ్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

బీపీఏలో పర్యటించిన మార్కెటింగ్ జీఎం



జీఎంను సత్కరిస్తున్న అధికారులు

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణి మార్కెటింగ్ జీఎం దేవేందర్ సోమవారం బెల్లంపల్లి ఏరియాలో పర్యటించారు. ఈ సందర్భంగా ఏరియాలోని ఖైరిగూడ ఓసీపీని సందర్శించి ఉత్పత్తి, ఉత్పాదకత, బొగ్గు రవాణా, డిస్పాచ్‌లపై అధికారులతో చర్చించారు. ఏరియాకు నిర్దేషించిన వార్షిక ఉత్పత్తి లక్ష్యంతో పాటు రవాణాను పూర్తి చేసేందుకు కృషి చేయాలన్నారు. మొదటిసారిగా బెల్లంపల్లి ఏరియాకు వచ్చిన సందర్భంగా జీఎం దేవేందర్‌ను ఖైరిగూడ ఓసీపీ అధికారులు శాలువాతో సత్కరించి మొక్కను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారి సత్యనారాయణ, మేనేజర్ ప్రవీణ్ ఫాటింగ్, సేఫ్టీ అధికారి రాజేశ్వర్‌రావు, సర్వే అధికారి రామాచారి, డీవైపీఎం వేణు, తదితరులు పాల్గొన్నారు.

చేనుకు చేటు వయ్యారిభామ

- పెరుగుతున్న కలుపుమొక్కలు
- పంటలతో పాటు, పశువులకు, మనుషులకు హానికరమే
- కంపోస్టు ఎరువు తయారీతో వినియోగం



పూతకు వచ్చిన వయ్యారిభామ

మంచిర్యాలఅగ్రికల్చర్: తొలకరి ఆరంభమైందంటే చాలు.. పంట చేన్లలో ముందుగా మొలక వచ్చేది వయ్యారిభామ (పార్థినియం హిస్టిరోఫోరస్). ఈ మొక్కలు ఇక్కడ అక్కడా.. ఈ నేల.. ఆ నేల అని తేడా లేకుండా ఎక్కడైనా.. ఏ పంటలోనైనా పెరుగుతాయి. ఉమ్మడి జిల్లాలో పత్తి, సోయా, కంది, మొక్కజొన్న తదితర అన్ని పంటల్లో వయ్యారిభామ మొక్కలు పెరుగుతున్నాయి. వీటిని నివారించేందుకు వ్యవసాయ శాస్త్రవేత్త మోహన్‌దాస్ సలహాలు.. సూచనలు ఆయన మాటల్లోనే..

నష్టం అపారం..

1950లో విదేశాల నుంచి గోధుమలను దిగుమతి చేసుకున్నప్పుడు మనదేశంలో ఈ మొక్క వ్యాప్తి చెందింది. ఈ మొక్క కలిగించే నష్టం అపారం. మొలిచిన నెల రోజుల్లోనే పూతకు వస్తుంది. ఒక్కో మొక్క 5వేల నుంచి 50 వేల వరకు విత్తనాల్ని ఉత్పత్తి చేస్తుంది. దూర ప్రాంతాలకు సైతం తేలికగా వ్యాపిస్తుంది.

మొక్కలతో హానికరం..

సామాన్య జనాలు తిరిగే పార్కులు, ఇంటి ఆవరణ, పాఠశాలలు, కళాశాలలు, పూలు, పండ్లతోటలలో అన్నిచోట్ల మొక్కలు పెరిగి పరిసరాల సహజత్వాన్ని పాడు చేస్తాయి. గడ్డి నేలలను కలుషితం చేసి పశుగ్రాసం కొరత కలిగిస్తాయి. వయ్యారిభామతో పంట మొక్కలకే కాదు.. మనుషులకు, పశువులకు కూడా ఇబ్బందులే. మనుషులు జ్వరం, ఉబ్బసం వంటి వ్యాధులతో పాటు చర్మ సంబంధమైన అలర్జీతో బాధపడుతారు. జలుబు, కళ్లు ఎర్రబడడం, కనురెప్పలు వాయడం వంటి సమస్యలు ఏర్పడుతాయి. ఈ విషపూరితమైన మొక్కల్ని తింటే పశువులు హైపర్ టెన్షన్‌కు గురవుతాయి. వాటి వెంట్రికలు రాలిపోతాయి.

మొదటి దశలోనే నివారించాలి..

వయ్యారిభామ మొక్కలు తక్కువ సంఖ్యలో ఉన్నట్లయితే వాటిని చేతితో పీకేయాలి. పూత దశకు రాకముందే పీకి తగులబెట్టాలి. లేదంటే వాటి వ్యాప్తి అధికమై పంట దిగుబడులు గణనీయంగా తగ్గుతాయి. మొక్క ఎదిగినకొద్దీ నివారించడం కష్టంగా మారుతుంది. ఒకవేళ పూత దశకు చేరుకున్న తర్వాత మొక్కల్ని పీకినట్లయితే వాటిని వెంటనే కుప్పగా వేసి తగులబెట్టాలి.

రసాయనాలతో నివారణ...

మొక్కజొన్న, జొన్న, చిరుధాన్యాల పంటల్లో విత్తనాలు మొలకెత్తక ముందు లీటరు నీటికి 4 గ్రాముల చొప్పున అట్రాజిన్ కలిపి పిచికారీ చేస్తే వయ్యారిభామ మొక్కల బెడద ఉండదు. మొక్కజొన్న, జొన్న పంటల్లో విత్తనాలు మొలకెత్తిన 15–20 రోజులకు లీటరు నీటికి 2 గ్రాముల చొప్పున 2.4–డి కలిపి పిచికారీ చేసుకోవచ్చు. పశుగ్రాస పంటలు వేసే వారు పంట వేయక ముందే లీటరు నీటికి 5 గ్రాముల చొప్పున అట్రాజిన్ కలిపి పిచికారీ చేయాలి. పశుగ్రాస పంటకు మొలకెత్తిన 15–20 రోజులకు లీటరు నీటికి 3 గ్రాముల చొప్పున 2,4–డి సోడియం సాల్ట్ కలిపి పిచికారీ చేయాలి. లేదంటే 10మిల్లీ లీటర్ల మెట్రిబుజిన్, 3–5 మిల్లీలీటర్ల గడ్డిమందును పిచికారీ చేయాలి.

పంటల విషయానికి వస్తే ..

వయ్యారి భామ మొక్కలు నీరు, పోషకాల కోసం పంట మొక్కలతో పోటీ పడి పెరుగుతాయి. ఫలితంగా దిగుబడులు 40 శాతం వరకు తగ్గుతాయి. వంగ, మిరప, టమాటా, మొక్కజొన్న, పత్తి పంట పూత దశలో ఉన్నప్పుడు వాటిపై వయ్యారిభామ పుప్పొడి పడితే ఉత్పత్తి తగ్గుతుంది. పంటకు మొవ్వకుళ్లు, కాండంకుళ్లు తెగుళ్లు సోకవచ్చు. వేరుశనగ పంటకు నెక్రోసిస్ తెగులు సోకుతుంది.

కంపోస్ట్ తయారీ ఇలా...

వయ్యారిభామ మొక్కలు హానికరమైనప్పటికీ వాటిని ఉపయోగించి కంపోస్ట్ తయారు చేసుకోవచ్చు. ఇందుకు నీరు నిలువని చోట 3మీటర్ల లోతు, 6 మీటర్ల వెడల్పు, 10 మీటర్ల పొడవు ఉండేలా గుంతతవ్వాలి. అందులో 50 కిలోల వయ్యారిభామ మొక్కల్ని వేసి, వాటిపై 5కిలోల యూరియా లేదా 50 కిలోల రాక్ ఫాస్ఫేట్ చల్లుకోవాలి. వీలైతే 50 గ్రాముల ట్రైకోడెర్మా విరిడె కూడా చల్లవచ్చు. మొక్కలకు వేర్లు లేకపోతే 10 నుంచి 15 కిలోల బంకమట్టి కలపాలి. ఈ విధంగా పొరలు పొరలుగా గుంతను డోము ఆకారంలో నింపుకోవాలి. పొరలపైన పేడ, మట్టి ఉనుక మిశ్రమాన్ని వేసి కప్పేయాలి. నాలుగైదు నెలల్లో కంపోస్టు తయారవుతుంది. దానిని జల్లెడ పట్టి, పంటకు వేసుకోవాలి. ఈ కంపోస్టులో నత్రజని, భాస్వరం, పొటాషియం, క్యాల్షియం, మెగ్నీషి యం అధికంగా ఉంటాయి. కూరగాయల పంటలకు ఎకరానికి 2కిలోల కంపోస్ట్ వేసుకోవ చ్చు. కంపోస్టును తక్కువ ఖర్చుతో తయారు చేసుకుని పంటలకూ వినియోగించుకోవచ్చు.

వేధించిన కేసులో ఏడాది జైలు

ఆసిఫాబాద్: విద్యార్థినిని వేధించిన కేసులో జైనూర్‌కు చెందిన రాథోడ్ మహేశ్‌కు ఏడాది జైలుశిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్ సోమవారం తీర్పు చెప్పారు. ఇందులో పోక్సోయాక్టు కింద రూ.10వేలు బాధితురాలికి చెల్లించాలని సూచించారు. లైజన్ అధికారి బషీర్ తెలిపిన వివరాల ప్రకారం... జైనూర్ మండలం కాశీపటేల్ గూడానికి చెందిన విద్యార్థిని ఉట్నూర్‌లో ఇంటర్ చదువుతోంది. 2018, డిసెంబర్ 14న ఉదయం కళాశాలకు వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన రాథోడ్ మహేష్, ఆటో డ్రైవర్ ఇస్లాం అసభ్యకరమైన సైగలతో వేధించారు. విద్యార్థిని తండ్రి కొడప విశ్వంభర్ ఫిర్యాదు మేరకు జైనూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. 12 మంది సాక్షులను కోర్టులో ప్రవేశ పెట్టగా నేరం రుజువుకావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న బైక్

కాగజ్‌నగర్‌టౌన్: ఆగి ఉన్న లారీని బైక్ ఢీకొన్న ఘటనలో వ్యక్తికి గాయాలైన సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గుర్తు తెలియని వ్యక్తి చింతగూడ నుంచి కాగజ్‌నగర్‌కు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా కాగజ్‌నగర్ పోలీస్ స్టేషన్ సమీపంలో నిలిపి ఉన్న ఎస్పీఎంలోకి వెళ్లే లారీని ఢీకొట్టాడు. గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు.